క్లుప్తంగా

డయేరియా నివారణపై అవగాహన

ప్రత్తిపాడు: శిశువులు అతిసారం బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరీ యునిస్ అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డయేరియా నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో పాటు తీసుకోవాల్సిన ఆహారం.. అతిసారం బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఐదేళ్ల లోపు చిన్నారులను గుర్తించి వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలను పంపిణీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, పీహెచ్‌ఎన్ నిర్మల, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే మలేరియా నివారణ



ప్రత్తిపాడు: ప్రజల సహకారంతోనే మలేరియాను నివారించవచ్చని ప్రత్తిపాడు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో శుక్రవారం మలేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. దోమకాటుతో మలేరియా ప్రబలుతుందన్నారు. దోమలకు మురుగు, నిలిచిన నీరు ఆవాస ప్రాంతాలని.. పరిసరాల్లో ఎక్కడా నీరు నిలవకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో దోమల ఆవాస ప్రాంతాలను గుర్తించి గ్రామ పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకుని ఫాగింగ్, బ్లీచింగ్, మడ్డి ఆయిల్ పిచికారీ వంటివి చేయించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు ఏపీఎంగా ప్రియదర్శిని



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వెలుగు ఏపీఎంగా డి.బసవ ప్రియదర్శిని బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలానికి ఆమె బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆమె మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తానని చెప్పారు.

గ్రామ స్వచ్ఛతకు చొరవ చూపాలి



ప్రత్తిపాడు: గ్రామ స్వచ్ఛతకు చొరవ చూపితే గ్రామానికి అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చునని డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం సుప్రీం ఎల్‌టీసీని శుక్రవారం ఆయన పరిశీలించారు. తడి చెత్త, పొడిచెత్త నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిక్కిరెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ మాకినేని జగన్‌మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి జి.మాధవిలతో మాట్లాడారు. గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు మరమ్మతులు చేపట్టి, పూర్తి స్థాయిలో వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు అభినందనీయం

పొన్నూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సభకు తహసీల్దారు మహమ్మద్ జియావుల్ హక్ అధ్యక్షత వహించి మాట్లాడారు. బ్రిటీష్ కాలం నుంచి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా రెవెన్యూ శాఖ సేవలందించిందన్నారు. ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందన్నారు. ప్రతి రెవెన్యూ ఉద్యోగి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. మాజీ తాహసీల్దార్ అన్నవరపు శేషగిరిరావు మాట్లాడుతూ.. దేశం ఆర్థికంగా ఎదగాలంటే రెవెన్యూ శాఖ కీలకమని అన్నారు. అనంతరం విశ్రాంత తహసీల్దార్లు అన్నవరపు శేషగిరిరావు, గేరా అంకారావు, విశ్రాంత డెప్యూటీ తహసీల్దార్ పాండురంగారావు, విశ్రాంత వీఆర్వోలు అచ్యుత రామారావు, కాటమరాజు జయ రామారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల్లో గుంతలు..
తీరేనా చింతలు!

- గుంతలమయంగా వంగిపురం–రావిపాడు రోడ్డు
- ప్రయాణానికి అల్లాడుతున్న ప్రజలు
- రైతులకూ తప్పని ఇక్కట్లు

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత సంక్రాంతి లోపే గుంతలన్నీ పూడ్చాలని.. రోడ్లపై గుంతలు కనిపించకూడదని ప్రభుత్వ పెద్దలు పదేపదే ప్రకటనలు గుప్పించారు. కానీ వాస్తవంలోకి వస్తే ప్రకటనలన్నీ గుంతల్లో కలిసిపోయినట్లేనని తేలిపోతుంది. అందుకు సాక్ష్యమే ఈ రోడ్డు. ప్రత్తిపాడు మండలంలోని వంగిపురం నుంచి పెదనందిపాడు మండలంలోని రావిపాడుకు వెళ్లే ఈ రోడ్డు భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. అడుగుకో గుంతతో ప్రయాణికులు నానా ఇబ్బందులూ పడుతున్నారు. సాధారణ రోజుల్లో ప్రయాణం అంతంతమాత్రంగా ఉంటుంటే.. ఇక వర్షాలు కురిసే రోజుల్లో అయితే వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

మూడు మండలాలకు ఒకటే రోడ్డు..

మూడు మండలాలకు ఒకటే రోడ్డు అనుసంధానంగా ఉంది. ప్రత్తిపాడు మండలంలోని వంగిపురం, తిమ్మాపురం, మేడావారిపాలెం.. పెదనందిపాడు మండలంలోని రావిపాడు, అబ్బినేనిగుంటపాలెం, గొరిజవోలుగుంటపాలెం, గోగులమూడి.. కాకుమాను మండలంలోని వల్లూరు, చినలింగాయపాలెం గ్రామాలకు ఈ రోడ్డు ద్వారా నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. మూడు మండలాలకు కీలకమైన రహదారిలో కూటమి ప్రభుత్వం కనీసం గుంతలు కూడా పూడ్చకపోవడంతో ప్రయాణం దుర్భరమవుతుంది. ఈ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఉండడం, ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలబడుతుండటంతో ప్రయాణం దుర్భరంగా మారుతుంది.

రైతులకూ అగచాట్లే..

రోడ్డు గుంతలమయమవడంతో ప్రయాణికులతో పాటు రైతాంగం కూడా నానా అవస్థలు పడుతుంది. ఆయా గ్రామాల్లో పండించిన మిర్చి, పత్తి, మినుము, పొగాకు.. వంటి పంటల దిగుబడులను ఇళ్లకు లేదా కోల్డ్ స్టోరేజీలు, యార్డులకు తరలించాలంటే కచ్చితంగా ఆ రోడ్డు ద్వారానే వెళ్లాల్సి ఉంటుంది. పొన్నూరు, కాకుమాను మీదుగా ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు ప్రాంతాలకు వెళ్లే ఎండు గడ్డి ట్రాక్టర్లు కూడా ఈ రోడ్డు ద్వారానే వస్తుంటారు. దీంతో రైతులకూ ఈ రోడ్డులో ప్రయాణం సంకటంగా మారుతుంది. ప్రభుత్వం స్పందించి రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



వంగిపురం రోడ్డులో భారీ గుంతలో నిలిచిన నీరు



భారీ గుంతలతో వంగిపురం-రావిపాడు రోడ్డు



గుంతల్లో వాహనాల రాకపోకలు

రైతులకు వ్యవసాయ డ్రోన్లు పంపిణీ



డ్రోన్లు పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

పొన్నూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మాచవరం, సీతారాంపురం.. చేబ్రోలు మండలంలోని వేజెండ్ల గ్రామాల రైతులకు మూడు వ్యవసాయ డ్రోన్లు పంపిణీ చేశారు. చింతలపూడిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయానికి యాంత్రీకరణ ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో రూ.9.80 లక్షల విలువ చేసే డ్రోన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఐదుగురు సభ్యులతో ఉన్న గ్రూపునకు 1 డ్రోను అందించినట్లు పేర్కొన్నారు. పొన్నూరు మండలంలో రెండు గ్రూపులకు 2 డ్రోన్లు, చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామంలో 1 గ్రూపునకు డ్రోను మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ రామకోటేశ్వరీ, ఏఈఓ శ్రీకాంత్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం రాష్ట్ర సదస్సు రేపు

పొన్నూరు: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు ఉద్యమంపై ఉక్కుపాదం మోపి.. విప్లవ విద్యార్థులను అణచివేస్తుందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.రాజారావు అన్నారు. పట్టణంలోని మానవ హక్కుల వేదిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకను నొక్కి, ఆదివాసీ సమాజాన్ని నిర్మూలించి, దేశ సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే దండకారణ్యంలో లక్షలాది సైన్యాన్ని కేంద్రం మోహరించిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో పూర్వ విప్లవ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న మానవహననాన్ని ఆపడమెలా.. అలాగే మావోయిస్టు పార్టీ ప్రతిపాదించిన చర్చల ప్రకటన అంశాలపై సమీక్షించుకునేందుకు ఆదివారం గుంటూరు బ్రాడీపేట ఎన్‌జీవో హోమ్‌లో విప్లవ విద్యార్థి ఉద్యమం రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు జీఎస్.రాయల్, కేవీపీఎస్ తోడేటి శ్రీనివాస్, ప్రజా కళాకారులు విజయ్, రాజేంద్ర, కోటేశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, మున్ని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

గుంటూరు రూరల్: చొడవరం గ్రామంలోని వెస్ట్–1 సెక్టార్ పరిధిలోగల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. 5 ఏళ్లు నిండిన చిన్నారులను ఎలిమెంటరీ స్కూల్‌కు పంపుతూ వారికి ఘన వీడ్కోలు తెలిపారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సర్టిఫికెట్లు, గిఫ్ట్‌బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో అరుణకుమారి, సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్స్ కృష్ణకుమారి, హేమలత, పుష్పలత, ధనుశ్రీ, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో అంగన్‌వాడీ సిబ్బంది

ఓఎన్‌జీసీ మట్టి నమూనాల సేకరణ

పెదకాకాని: పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు శివారులో ఓఎన్‌జీసీ సంస్థ పర్యవేక్షణలో మట్టి నమూనాలు సేకరించారు. ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో చమురు, గ్యాస్, ఆయిల్ గుర్తింపులో భాగంగా శుక్రవారం సాయిల్ టెస్టింగ్ నిర్వహించారు. సుమారు 20 వాహనాలు తక్కెళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాల మధ్య రోడ్డుకు సమీపంలో సాయిల్ టెస్టింగ్ ప్రక్రియ చేపట్టడంతో స్థానిక ప్రజల్లో పలు రకాల ఆలోచనలు రేకెత్తాయి. ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపడుతున్నారనే ప్రచారం జరిగింది. అయితే ఓఎన్‌జీసీ సంస్థ మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు ప్రకటించడంతో గ్రామాల ప్రజలు, ముఖ్యంగా రైతుల ఆలోచనలకు తెరపడింది.



ఉప్పలపాడు శివారులో మట్టి నమూనాలు సేకరిస్తున్న యంత్రాలు

రెవెన్యూ శాఖ ద్వారా విస్తృత సేవలు

ప్రత్తిపాడు: రెవెన్యూ శాఖ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు విస్తృత సేవలు అందించనున్నట్లు తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం 'రెవెన్యూ డే' వేడుకలను నిర్వహించారు. హాజరైన తహసీల్దార్ కరుణకుమార్ మాట్లాడుతూ.. 238 సంవత్సరాల క్రితం రెవెన్యూ వ్యవస్థ ఏర్పడిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో మార్పులు, మరెన్నో రూపాంతరాలు చెందుతూ నిర్విరామంగా ప్రజలకు సేవలందిస్తున్న శాఖ రెవెన్యూ అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ, వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఐఐఎంఎస్ ప్రవేశ పరీక్షలో కొత్తరెడ్డిపాలెం విద్యార్థి ప్రతిభ



మను శశిధర్‌రెడ్డి

చేబ్రోలు: ఢిల్లీ ఏఐఐఎంఎస్ (ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) నిర్వహించిన సూపర్ స్పెషాల్టీ ప్రవేశ పరీక్షలో స్పైన్ సర్జరీ విభాగంలో చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం విద్యార్థి గాదె మను శశిధర్‌రెడ్డి మొదటి ర్యాంక్ సాధించినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆల్ ఇండియాలోని రెండు ఎయిమ్స్ కళాశాలలైన రుషికేశ్, భోపాల్ కళాశాలలో ఒక్కొక్క సీటు చొప్పున మొత్తం రెండు సీట్లలో మొదటి ర్యాంక్ సాధించిన మను శశిధర్‌రెడ్డి రెండు కళాశాలల్లో ఒకదానిలో ఈ నెలలో ప్రవేశం పొందనున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. జాతీయ స్థాయిలో సూపర్ స్పెషాల్టీ ప్రవేశ పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన శశిధర్‌రెడ్డిని కొత్తరెడ్డిపాలెం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కెరీర్ కౌన్సిలింగ్ ట్రైనర్ గాయత్రి మాట్లాడుతూ.. తల్లిదండ్రులను, గురువులను, గౌరవించాలని తెలిపారు. లక్ష్యాన్ని ఏర్పరచుకుని లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, యువజన సర్వీసులశాఖ మేనేజర్ బి.రాధిక, వి.సాయిసాత్విక్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ ప్రారంభం

పెదకాకాని: సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.రమణకుమార్ అన్నారు. పెదకాకాని వ్యవసాయ కార్యాలయంలో ఏవో మాట్లాడుతూ.. బీపీటీ–5204 ధర 1 కిలో రూ.43 ఉండగా దానిలో కిలోకి రూ.5 సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సబ్సిడీ పోగా కిలో విత్తనాలు రూ.38 చొప్పున 25 కిలోల బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సంక్షేమ కేంద్రంలో పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకుని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కళాశాలలో యోగా దినోత్సవం

గుంటూరు రూరల్: యోగా ద్వారా విద్యార్థుల్లోని ఆలోచనా శక్తి, ఆరోగ్యం మెరుగుపడుతుందని కళ్లం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎమ్ ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులకు యోగాసనాలు నిర్వహించారు. యోగా చేయడంతో ఎన్నో లాభాలున్నాయని, శారీరకంగా, మానసికంగా దృఢంగా మారతామని, యోగా అనేది ఓ దివ్యౌషధమని డైరెక్టర్ తెలిపారు. యోగాభ్యాసం ద్వారా ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు ఎలా పరిష్కరించాలనే సామర్థ్యం, ధైర్యం పెరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. ఈషా ఫౌండేషన్ గుంటూరు సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, దోరశిల శ్రీనివాసులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య పరిరక్షణే యోగా



శారీరక మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు యోగ దోహదపడుతుందని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సంధ్యారాణి అన్నారు. పెదకాకాని సెయింట్ జోసఫ్ పాఠశాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏటా జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సిస్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. రోజూ యోగా సాధన చేయడం ద్వారా విద్యార్థుల దైహిక స్థితి మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఇదే మార్గంలో ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాలని ఆమె సూచించారు. పాఠశాల శారీరక విద్య ఉపాధ్యాయుల నేతృత్వంలో విద్యార్థులు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, వజ్రాసనం లాంటి విభిన్న ఆసనాలను ప్రదర్శించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించే పంచాంగ పత్రికలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

– పెదకాకాని

యోగాంధ్ర కాదు.. ఉద్యోగాంధ్ర కావాలి

ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి

లక్ష్మీపురం: రాష్ట్రంలో యువతకు యోగాంధ్ర కాదు.. ఉద్యోగాంధ్ర కావాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలి ప్రభుత్వాన్ని నిలదీశారు. కొత్తపేట సీపీఐ కార్యాలయం నుంచి భగత్ సింగ్ విగ్రహం వరకు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని హామీ అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో ఏ ఉపాధి లేనివారు ఒక కోటి 56 లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయని గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ జిల్లాలో ఖాళీలుగా ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్లా మరియదాసు, అరుణ్, రెహ్మాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యశ్వంత్, శివ, బన్ని, అమర్నాథ్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

పొన్నూరు: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దొప్పలపూడి గ్రామానికి చెందిన తమలపాకు చిన కోటయ్య(35) పట్టణ శివారు పొలాల్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు తెలుపగా ఘటనా స్థలానికి వారు చేరుకున్నారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డారని.. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ వీరానాయక్ దర్యాప్తు చేపట్టారు.

ఫార్మసీ పరిశోధనల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ రంగంలో పరిశోధనల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ శాఖ ముఖ్య సాంకేతిక సలహాదారుడు డాక్టర్ ఎం.శ్రీనివాస శంకర్‌ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో పరిశోధనలు– అభివృద్ధి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస శంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలల్లో బోధన చేస్తున్న అధ్యాపకులు ఔషధ రంగంలో పరిశోధనలు చేసి, నూతన ఔషధాలను ఆవిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు తగిన శిక్షణ కల్పించి, పరిశోధన సాగించే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లతో పాటు స్టార్టప్ కంపెనీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ పాముకాటు, కాళ్ల తిమ్మిర్లకు మనం వినియోగించే క్రియాశీల రసాయన పదార్థాల వివరాలను తెలుసుకుని, పేటెంట్ పొందవచ్చునని తెలిపారు. గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ మధుమేహ చికిత్సకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పాల్గొన్నారు.



శంకర్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, రాధాకృష్ణమూర్తి

యువతి అదృశ్యం

లక్ష్మీపురం: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. పల్నాడు జిల్లా క్రోసూరు మండలానికి చెందిన ఓ యువతి అరండల్‌పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఈనెల 5న ఆస్పత్రిలో విధులకు హాజరయ్యేందుకు వచ్చింది. యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు కె.సుబ్బరావమ్మ

లక్ష్మీపురం: అంగన్‌వాడీలకు తక్షణమే పెరుగుతున్న ధరలకు వేతనాలు పెంచాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ జూన్ 23న జరిగే కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ విజ్ఞప్తి చేశారు. పాత గుంటూరులోని సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీల జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హెల్పర్స్ ప్రమోషన్‌కు విధివిధానాలు రూపొందించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి అధ్యక్షత వహించగా జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, పద్మజా, ప్రేమలత, జిల్లా సహాయ కార్యదర్శి హేమలత, రత్న మంజుల హాజరయ్యారు.